వార్డా... ఉద్యానవనమా...!

- కాకినాడ జీజీహెచ్ క్యాన్సర్ వార్డులో ఇండోర్ ప్లాంట్స్ ఏర్పాటు
- సిబ్బంది చొరవకు హెచ్‌వోడీ, సూపరింటెండెంట్ ప్రోత్సాహం

కాకినాడ క్రైం: ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓ వార్డు పచ్చదనాన్ని నింపేసుకుంది. ఎటు చూసినా చిట్టి పొట్టి మొక్కలతో కళకళలాడుతోంది. అక్కడున్న మొక్కలు రోగులను ఎలా ఉన్నారంటూ బాగోగులు అడుగుతున్నట్లు, భయం లేదు కోలుకుంటారంటూ భరోసా ఇస్తున్నట్లు, పసిమొగ్గలు పాలబుగ్గలతో మనతో బోలెడన్ని కబుర్లేవో చెబుతున్నట్లు ఆప్యాయంగా పలకరిస్తూ వారి దిగులును దూరం చేస్తున్నాయి. స్వచ్ఛమైన ప్రాణవాయువును పైసా ఖర్చు లేకుండా అందిస్తూ ప్రాణాపాయంతో ఆసుపత్రిలో చేరిన రోగులకు మాత్రం నిస్వార్థంగా సేవ చేస్తున్నాయి. వేదన నిండిన హృదయానికి అంతులేని సాంత్వనను చేకూరుస్తున్నాయి. వార్డా.. ఉద్యానవనమా.. అన్న రీతిలో తన్మయత్వాన్ని రంగరించుకున్న ఈ పచ్చదనపు రాజసం మరెక్కడో కాదు కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న కేన్సర్ వార్డుదే.. నర్సింగ్ సిబ్బంది చొరవ, సూపరింటెండెంట్ సహా హెచ్‌వోడీ ప్రోత్సాహం వెరసి క్యాన్సర్ వార్డును ఆహ్లాదభరితంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేసేందుకు కారణమైంది. నర్సింగ్ సిబ్బందిలో కొందరు ఎంతో మురిపెంగ మొదలుపెట్టిన ఈ ప్రయత్నం సత్ఫలితాలిస్తోంది.

ఒక్క ఐడియా వార్డు రూపును మార్చేసింది

వార్డులో పలు ప్రత్యేక సందర్భాల్లో అక్కడున్న హెచ్‌వోడీ సహా పలువురికి గిఫ్టుల రూపంలో మొక్కలు అందేవి. వాటిని అక్కడే టేబుల్‌పై పెట్టి వెళ్లిపోయేవారు. ముద్దొస్తున్న మొక్కలను అలా వదిలేయలేక ఏం చేయాలా అనే ఆలోచన అక్కడున్న విధులు నిర్వర్తిస్తున్న నర్సుల్లో కలిగింది. నర్సులు చిన్నారి, సుధ, సత్య సుధ, సుమ, భవానీ, బేబీ, ఇందిరా, నాగమణిలు తమకొచ్చిన ఆలోచనను హెడ్ నర్సు ఉషారాణి ముందుంచారు. హెచ్‌వోడీ, సూపరింటెండెంట్‌ల సహకారంతో మొక్కలను వార్డులోనే పెంచాలనే నిర్ణయానికి వచ్చారు. అలా బహుమతిగా వచ్చిన ప్రతి మొక్క ఆ వరుసలోకి చేరుతుంది. అలా ఇప్పటికే 20కి పైగా అరుదైన జాతి మొక్కలు క్యాన్సర్ వార్డుకు కళనిస్తూ రోగులు, సిబ్బంది సేవలో తరిస్తున్నాయి.


జీజీహెచ్ క్యాన్సర్ వార్డులో మొక్కలకు నీళ్లు స్ప్రే చేస్తున్న నర్సు


మొక్కలను మురిపెంగా చూస్తున్న క్యాన్సర్ బాధితురాలు

అరుదైన మొక్కల సంపద

క్యాన్సర్ వార్డు అరుదైన ఇండోర్ ప్లాంట్స్‌కు ఆలవాలంగా మారింది. ఔత్సాహికులు కొందరు అప్పటికే సమకూరుతున్న బహుమతులకు అదనంగా అరుదైన, అందమైన జాతి మొక్కలను కొని తెస్తున్నారు. నీరు, వెలుతురు లేకుండానే ఈ మొక్కలు తమ మనుగడను సాగిస్తూ కార్బన్‌డై ఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడం వీటి ప్రత్యేకత. క్యాన్సర్ వార్డులో అరికాపా, రేపిక్స్ పా, ఫినో టాండ్రప్స్, ఫెరన్, స్నేక్ ప్లాంట్, స్పైడర్ ప్లాంట్, అలోవెరా, లక్కీ బ్యాంబూ వంటి ఎన్నో మొక్క జాతులు దర్శనమిస్తున్నాయి.

ఇవీ ప్రయోజనాలు

క్యాన్సర్ వార్డులో కొలువుదీరిన ఇండోర్ ప్లాంట్లతో బహుళ ప్రయోజనాలు అందుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆక్సిజన్ ఉత్పత్తి, టాక్సిన్‌లు దూరం చేయడం, రోగుల్లో అలర్జీలు, ఒత్తిడి, మనో వ్యాకులతను నివారించడం, జలుబు నియంత్రించడం, శ్వాసకోస సమస్యల నివారణ, ఏకాగ్రతను ప్రేరేపించడం, వార్డులో ఉష్ణోగ్రతను సమతూకం చేయడం, గదిలో తేమను పెంచడం, స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించడం, నిద్రలేమిని నివారించడం, చర్మం పొడిబారకుండా కాపాడడం వంటి ప్రయోజనాలు చేకూరుతాయంటున్నారు.

వార్డులో మొక్కల ఏర్పాటుతో సత్ఫలితాలు



క్యాన్సర్ వార్డులో మొక్కల ఏర్పాటుతో సత్ఫలితాలు అందుతున్నాయి. రోగులు సాంత్వన పొందుతున్నారు. వారి ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం సిబ్బందికి కూడా తోడ్పడుతోంది. విధి నిర్వహణలో అలసిన వేళ మొక్కల పచ్చదనం సాంత్వననిస్తుంది. పలువురు క్యాన్సర్ బాధితులు మొక్కల్ని చూస్తూ తన్మయం చెందుతారు. ఈ స్థితి వారి మానసిక ఆరోగ్యాన్ని మరింత పటిష్టం చేసి వ్యాధి నుంచి త్వరగా కోలుకునేలా చేస్తుంది. ఆసుపత్రిలో ఇతర వార్డుల్లోనూ ఇండోర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

రోజులో రెండు నిమిషాలు కేటాయిస్తే చాలు

వార్డుల్లో వీటి నిర్వహణ అత్యంత సులువని అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. నర్సింగ్ సిబ్బంది రోజులో ఏదో ఒక సందర్భంలో రెండు నుంచి నాలుగు నిమిషాల సమయం మాత్రమే కేటాయించి నీటిని స్ప్రే చేస్తారన్నారు. వీటి పెరుగుదలకు ఎండ, వెలుగు అవసరం లేదన్నారు. నిర్వహణ భారం ఉండదనీ, మొక్కలకు చీడపట్టడం అరుదని అన్నారు. దీంతో డబ్బు, సమయం వెచ్చించాల్సిన పని లేదని డాక్టర్ వాసన్ తెలిపారు.

క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక బక్రీద్


మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న అడబాల రత్నప్రసాద్

కాకినాడ రూరల్: బక్రీద్ త్యాగానికి ప్రతీక అని రమణయ్యపేట మాజీ సర్పంచ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని సోమవారం ఆయన రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రెడ్నం రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

బోట్‌క్లబ్: పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో నిత్యావసర సరకులు, కూరగాయలు, సాధారణ టిఫిన్ మీల్స్ వంటి ఆహార పదార్థాల రేట్లు నూరు శాతం పెరిగాయన్నారు. బియ్యం, మంచినూనె, కంది పప్పు, చింతపండు ధరలు పెరగడంతో కల్తీ వస్తువులతో ఆహార విక్రయాలు పెరిగాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రైతు బజార్ల ద్వారా కూరగాయలు, నిత్యావసరాలు సబ్సిడీ ధరలకు విక్రయించాలని కోరారు.

జాతీయ బాలికల రగ్బీ పోటీలకు ఎంపిక


సునంద తేజశ్రీ

కరప: మండలంలోని గురజనాపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి సునంద తేజశ్రీ ఆల్ ఇండియా బాలికల రగ్బీ పోటీలకు ఎంపికైంది. ఆమె కాకినాడలోని అన్నవరం సత్యదేవ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తేజశ్రీ విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ చాంపియన్ షిప్ బాలికల పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడి ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర బాలికల రగ్బీ జట్టుకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ చింతా నారాయణమూర్తిరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి రెండు రోజుల పాటు పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు తేజశ్రీ సోమవారం బయలుదేరి వెళ్లినట్టు ప్రిన్సిపాల్ మూర్తిరాజు తెలిపారు. ఈ సందర్భంగా సునంద తేజశ్రీని ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

హైవేపై లారీ బోల్తా


జాతీయ రహదారిపై బెండపూడి వద్ద బోల్తా పడిన లారీ

తొండంగి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట ఆదివారం అర్ధరాత్రి లారీ బోల్తా పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం నుంచి ఐరన్ బ్యారల్స్ లోడుతో బెంగళూరు వెళ్తున్న లారీ తమ్మయ్యపేట వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి రహదారికి అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను అదుపు చేసి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. క్రేన్ సాయంతో లారీలో ఐరన్ బ్యారల్స్‌ను మరో లారీకి ఎక్కించి బోల్తా పడిన లారీని అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సత్యనారాయణరాజు సేవలు చిరస్మరణీయం


సత్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో పెన్షనర్ల ఉద్యమంలో చక్కన సత్యనారాయణరాజు సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఏ శాస్త్రి అన్నారు. కాకినాడ యూటీఎఫ్ హోమ్‌లో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా సత్యనారాయణరాజు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఏ శాస్త్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుధాకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు కలిసి నూతన ఎంపీలకు విజ్ఞాపన పత్రం అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఆదినారాయణమూర్తి, కె.సుధాకరరావు, కేపీ కుమార్, దీనబంధు, కె.రమణమూర్తి, కర్రి బాబూరావు జార్జ్, రామదాసు, మోహన్‌రావు, కృష్ణారావు, అజయ్‌కుమార్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు


ఈదురు గాలులకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభం


భారీ గాలులకు నేలకొరిగిన చెట్టు


హెచ్‌టీ లైన్‌లో తీగలను సరి చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి, రమణయ్యపేట, వలసపాకల తదితర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం వీచిన బలమైన ఈదురు గాలులకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరిస్తున్నారు. మొత్తం ఎల్‌టీ, హెచ్‌టీ లైన్లలో 11 స్తంభాలు ధ్వంసం కాగా, వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో తీగలు పడిపోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రమణయ్యపేట పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం మరమ్మతుల పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


నాగులపల్లి పీహెచ్‌సీలో రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సౌజన్య

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య సూచించారు. మండలంలోని నాగులపల్లి పీహెచ్‌సీలో సోమవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఏడిస్ దోమ వల్ల డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ సోకితే ఒళ్లనొప్పులు, కళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సీజన్‌లో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ వినియోగించాలని సూచించారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం


కొంగోడులో వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు


కరపలో రామలింగేశ్వరస్వామి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

కరప: గ్రామంలో వేంచేసిన పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామివారి వార్షిక కల్యాణం బాణసంచా కాల్పులతో, మంగళవాయిద్యాల నడుమ సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిపారు. జ్యేష్ఠ మాసం శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కళ్యాణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా శివాలయంలోని స్వామి, అమ్మవార్లను ప్రధాన అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేకంగా అలంకరించి పూజాధికాలు నిర్వహించారు. రాత్రి రామలింగేశ్వర స్వామివారిని పెండ్లి కుమారుడిగా, పర్వతవర్ధినీ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించి, పల్లకీలో ఉంచి, కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేద పండితులు డి.ఈశ్వరబాబు, శ్రీనివాస్, ఫణిరాజు మంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణ క్రతువును నిర్వహించారు. ఈఓ కె.తిరుమల రవితేజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణ వేడుకలు తిలకించి, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వేడుకగా కొంగోడు వెంకన్న కల్యాణం

కరప: మండలం కొంగోడు గ్రామంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు పెద్దింటి రామానుజాచార్యులు ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. రాత్రి స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీలు ఆట్ల గోవిందరాజులు, మేడిశెట్టి సత్తిరాజు, ఎం.వీరభద్ర వెంకట్రావు, టి.సుబ్బారావు, నక్కా గోవిందు, వంశపారంపర్య ధర్మకర్తలు డాక్టర్ సి.ఫణీంద్ర, డాక్టర్ సి.శ్రీధర్ పాల్గొన్నారు.


కొంగోడులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

డయేరియా రోగులకు పరామర్శ


కొమ్మనాపల్లిలో డయేరియా బాధితులను పరామర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లిలో డయేరియా రోగులను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి నరసింహనాయక్ సోమవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా గ్రామంలో పలువురు వాంతులు విరోచనాలతో డయేరియా బారినపడి పలు ఆస్పత్రుల్లో చేరి వైద్యం పొందుతున్నారు. వీరిలో ఓ వివాహిత మృతి చెందిన సంగతి విదితమే. కాగా సోమవారం కూడా 10 కేసులు నమోదయ్యాయని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకూ 100 మంది డయేరియా బాధితులను గుర్తించారు. వీరంతా పిఠాపురం, కాకినాడ జీజీహెచ్, కత్తిపూడి, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారు. డయేరియా ప్రబలిన నేపథ్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్ వైద్యశిబిరంలో రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి డయేరియా నివారణపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సరిత, వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి వెండి కిరీటాల వితరణ


వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలు అందజేస్తున్న దాతలు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు భక్తులు నాలుగు వెండి కిరీటాలను వితరణ చేశారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండకు చెందిన శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థ, శీలది గ్లోబల్ స్కూల్ యాజమాన్యం సభ్యులు ఈ వెండి కిరీటాలను సోమవారం ఆలయానికి అందజేశారు. అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలను అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పులగం కృష్ణప్రసాద్, పులగం నరసింహారావు, దాతలు శీలది గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ జి.లక్ష్మీపద్మావతి, శ్రీషిర్డీ సాయి స్కూల్ కరస్పాండెంట్ శ్యామల, శ్రీదేవి, ఫణి, లక్ష్మి, చంటి, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లిలోని మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని లివింగ్ గాడ్ చర్చ్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ డాక్టర్లు కంటి పరీక్షలు చేస్తారన్నారు. గెద్దనాపల్లి, పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం


ఏలేశ్వరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

- కన్నులపండువగా సత్యనారాయణస్వామి కల్యాణం
- వేలాదిగా తిలకించిన భక్తులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నది ఒడ్డున వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామివారి వార్షిక కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామ్‌చంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్ నేతృత్వంలో పండితుడు పెద్దింటి గోపాలకృష్ణాచార్యులు, పాన్నూరు సత్యనారాయణచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి కల్యాణాన్ని తిలకిచేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వేద పండితులు వేదుల సూర్యనారాయణశర్మ, అమరేశ్వర అవధాని, అర్చకులు కంచిబొట్ల రామ్‌కుమార్, ఇంద్రగంటి పవన్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి దంపతులు, ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, ఒబిణ్ణి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

గొల్లప్రోలు: మండలంలోని కొడవలిలో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని పోలవరపు చంద్రరావు తాటాకింట్లో ఉదయం 8.30 గంటలకు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఏడు కాసుల బంగారం, రూ.లక్ష నగదుతో పాటు వంట సామగ్రి, దుస్తులు, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్టు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగింది. ప్రమాద సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. దీనిపై బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.